
# షోక్

"పొరుగింటి మీనాక్షమ్మను చూసారా... వాళ్ళాయన చేసే ముద్దూముచ్చట విన్నారా..." టేప్ రికార్డర్‌లో నుంచి హోరుగా విన్పిస్తున్న ఆ పాటను విని ఆనందపారవశ్యం లో తేలిపోతున్న భార్యను విసుగ్గా కేకేసాడు నారాయణ. "సువర్చలా... ఏమిటది? అంత వాల్యూమ్‌తోనా పాట వినడం? కాస్త సౌండ్ తగ్గించు".



సూరిపండు

అతని మాటలు పట్టించుకోలేదు సరికదా ముక్కుమూతీ తిప్పుకుంటూ "నీ మాటలేం నాకు లెక్కా..." అన్నట్టు మరలా పాట వినడంలో లీనమైపోయింది సువర్చల. "అబ్బబ్బ... నీకే చెప్పేది. ఆ వాల్యూమ్ తగ్గించు. అయినా... అస్తమానూ ఆ పాత పాటే అంత యిష్టంగా వింటావెందుకు?" అడిగాడు నారాయణ తీవ్ర స్వరంతో.

"అయ్యో! ఆ మాత్రం అర్థమైతే ఈ తిప్పలు నాకెందుకొస్తాయి? ఒకటికి మరొకసారి విన్పిస్తేనన్నా మీ చెవిలో పడుతుందని. ఉహు... శుద్ధబుద్ధావతారం. మొద్దుకయినా ముద్దొచ్చే రూపు తేవచ్చేమో కానీ మిమ్మల్ని మార్చడం ఆ బ్రహ్మకి కూడా తరం కాదు" విసుక్కుంటూ టేప్ రికార్డర్ కట్టేసింది సువర్చల.

"ఏమిటి సువర్చలా?... ఎందుకలా చిటపటలాడతావు? ఇది ఎప్పుడూ ఉండేదే కదా! నువ్వలా చెప్పడం... నేను కాదనడం..."

"అవును స్వామీ... అవును. రాయగా రాయగా రాయైనా అరుగుతుందేమో కానీ వజ్ర సదృశమైన మీ హృదయఫలకం కరుగునా... మమ్ము కరుణించునా..." నాటకఫక్కీలో అన్న సువర్చల మాటలకు ఫక్కున నవ్వేశాడు నారాయణ.

"ఆహా... ఈ నవ్వులు రువ్వడానికేమీ తక్కువ లేదు. క్రియ కొచ్చేసరికి మాత్రం అంతా శూన్యం..." చేత్తో గాలిలో పెద్ద సున్నా చుడుతూ అంది సువర్చల.

తను కూర్చున్న చోటు నుంచి లేచి ఆమె దగ్గరకు వెళ్ళాడు. ఆమె భుజం చుట్టూ చెయ్యి వేసి దగ్గరకు తీసుకుంటూ "చూడు సువర్చలా... ఇప్పుడు మనకేం తక్కువయిందని?..."

ఇంకా నారాయణ ఏదో అనబోతూ ఉంటే మధ్యలోనే అందుకుంది ఆమె. "అబ్బ... దూరంగా ఉండండి. బాబిగాడు రాగలడు. అయినా ఏమెక్కువయ్యాయని? తక్కువ కాలేదనుకోవడానికి? పట్టుమని పది పట్టుచీరెలయినా లేవే... ఏ ఫంక్షన్‌కయినా వెళ్ళినప్పుడు కట్టుకోవడానికి. జిడ్డోడుతూ ఈ పసుపుతాడు తప్ప కనీసం ఓ నానుతాడయినా చేయించగలిగారా? బాబిగాడికి ఓ నాలుగు మంచి డ్రస్సులయినా తీయించారా ఎప్పుడయినా? 'నాన్నా నాకు షూ కావాల'ని ఎన్నాళ్ళబట్టి ఏడుస్తున్నాడు? అదేనా కొనగలిగారా? నేనేమైనా గొంతెమ్మ కోర్కెలు కోరుతున్నానా? ఓ డబుల్‌కాట్, ఓ డ్రస్సింగ్‌టేబుల్, ఓ ఆరడుగుల బీరువా. ఈ మాత్రం లేకపోతే ఇల్లు ఇల్లులాగైనా ఉండొద్దూ! నేనేమన్నా ఫ్రిజ్‌లు కొనమన్నానా?... ఏసి మెషిన్‌లు కొనమన్నానా?... ఏడంతస్తుల మేడలు కావాలన్నానా?... కాంటెస్సా కారు అడిగానా?..."

"స్టాప్... స్టాప్... స్టాప్ డియర్... ఈ దండకాలన్నీ నువ్వు రోజూ చదివేవే కదా! చూడు... మనం చదువుకున్నవాళ్ళం. ప్రాక్టికల్‌గా ఆలోచించడం చేయాలిగానీ అందని వాటికోసం అర్రులు చాస్తూ ఉన్నదానిలో ఆనందం పోగొట్టుకోకూడదు. చేయలేని పనులకు పోయి మోయలేని బరువులెత్తుకొని భంగపడేకంటే ఉన్నదానితో తృప్తి పడడం అలవర్చుకోవడంలో సుఖం ఉంది. సుఖసంతోషాలు విలువైన వస్తువుల్లోనో... ఖరీదైన ఫర్నిచర్‌లోనో లేవు సువర్చలా. మన మనసులోనే ఉన్నాయి సంతోషమూ, దుఃఖమూ... రెండూ. దేన్ని స్వీకరించాలో నిర్ణయించుకోవలసింది మనమే.

ఏ అంపలాలూ లేకపోయినా మనకున్న ప్రశాంతత మరెవరికొస్తుంది? నా ఉద్యోగంలో సంపాదిస్తున్నది మన కనీసావసరాలకు సరిపోవడం లేదా? ప్రతి ఆదివారం ఏ టెన్షనూ

లేకుండా బాబిగాణ్ణి తీసుకొని ఏదో చోటికి సరదాగా తిరిగొస్తున్నాం. కనీసం నెలకోసారి సినిమా చూస్తున్నాం. పండుగలూ పబ్బాలూ మన తాహతుకి తగ్గట్టు చక్కగా జరుపుకుంటున్నాం. సాయంకాలాలు సరదాగా ఆరు బయట చల్లగాలి పీలుస్తూ కబుర్లు చెప్పుకుంటున్నాం. వెన్నెట్లో డాబా మీద పక్కలు పరుచుకొని... చల్లగాలి నైట్‌క్వీన్ పరిమళాలు మోసుకొస్తుంటే నా గుండెల మీద నువ్వు తల ఆన్చుకొని పడుకుంటే... కొబ్బరాకుల సందుల్లో నుంచి చందమామ తొంగిచూస్తుంటే కమ్మగా కబుర్లాడుకుంటుంటే ఆ సన్నివేశాలు అందించే ఆనందం ఏ సంపదలందించగలవు సువర్చలా? మధ్య తరగతి జీవితాల్లో భార్యాభర్తలిద్దరూ మాట కలుపుకొని ఒద్దికగా జీవితం దిద్దుకుంటే స్వర్గ సౌఖ్యాలతో తులతూగడం కాదంటావా చెప్పు సువర్చలా. మనం సంతోషంగా లేమంటావా...?"

"తియ్యటి కబుర్లు చెప్పడంలో మన తర్వాతే... ఎప్పుడూ గొర్రెకు బెత్తెడే తోక చందాన ఎదుగూబొదుగూ లేని ఉద్యోగం చేస్తుంటే ఇంతకంటే ఏం చెప్తారు? ఇబ్బడిముబ్బడిగా డబ్బులు సంపాదించడం చేతకాదని చెప్పరాదూ..." ఈసడింపుగా అంది సువర్చల.

"ప్లీజ్... నా మాటల్లో నిజాన్ని తెలుసుకోవడానికి ప్రయత్నించు సువూ. డబ్బుంటే అన్నీ అమురుతాయనడం నిజమే కావచ్చు. ధన సంపాదనే ధ్యేయంగా... నోట్ల కట్టలే పరమావధిగా జీవనసమరం సాగించాలనుకొంటే మనం కోల్పోయేదీ ఎంతో ఉంటుంది. సౌఖ్యాలు మన చేరువకి రావడం జరుగుతుందేమో కానీ సంతోషాన్ని పొందడం మాత్రం జరిగేపని కాదు".

"ఆడలేనమ్మ స్టేజీ వీక్ అందట. చేవలేని మొగుడు చేతకాదన్నాట్ట. అంత సంపాదించే శక్తే ఉంటే అదేదో చేసి చూపించరాదూ. ఈ పోసికోలు కబుర్లెందుకూ చెప్పడం? ఆయనే ఉంటే విస్తరాకెందుకని... కానివ్వండి మీ పేపరు పఠనం. ఈలోపు వాయనం సిద్ధం చేస్తాను..." అంటూ వంట గదిలోకి వెళ్ళింది సువర్చల.

మనసు చివుక్కు మనగా ఆమె వెళ్ళిన వైపే చూస్తూ ఆలోచనలో పడిపోయాడు నారాయణ.

* * *

కాల చక్రగమనంలో మూడు సంవత్సరాలు గడిచిపోయాయి. అది కాలానికి చాలా తక్కువే కావచ్చు. కానీ మానవ మనుగడలో ఎక్కువే. ఆ మాత్రపు కాలం చాలు... పూరిళ్ళు మేడలవడానికి, మేడలు పూరిండ్లవడానికీ. ఏవి ఏమైనా కాలం మాత్రం యథేచ్ఛగా కరిగిపోతూనే ఉంటుంది. ఆనాటి నారాయణ ఆలోచనలకు ఫలితం...

"యస్... మిస్టర్ ప్రసాద్ ప్లీజ్ బి ప్రొసీడ్.." హడావిడిగా మేడ మెట్లు దిగుతూ అన్నాడు నారాయణ తన సెక్రటరీతో. ఉదయం నుంచి రాత్రి పన్నెండు గంటల వరకూ ఉన్న అపాయింట్‌మెంట్స్ వగైరాలన్నీ ఏకరువు పెట్టడం మొదలు పెట్టాడు ప్రసాద్. అతని మాటలు వింటూనే హాల్లో తన కోసం వెయిట్ చేస్తున్న విజిటర్స్ దగ్గరకు వెళ్ళాడు. సోఫాల్లో కూర్చున్న వాళ్ళందరూ నారాయణను చూసి లేచి నిలబడి 'గుడ్‌మార్నింగ్ సార్...' అంటూ విష్ చేసారు. చిరునవ్వుతోనే వాళ్ళని పలకరించాడు. "సారీ ఫ్రెండ్స్. నౌ అయామ్ వెరీ బిజీ. ప్లీజ్... అపాయింట్‌మెంట్ తీసుకోండి. తరువాత కలుద్దాం. థాంక్‌యూ" అంటూ గబగబా బైటకు వెళ్ళబోయాడు.

"ఏమండీ... ఏమండీ... ఒక్క నిమిషం" అంటూ లోపలి నుంచి వచ్చింది సువర్చల. "వాట్ యార్. ఏమిటి విషయం?" విసుగును కప్పిపుచ్చుకుంటూ అడిగాడు నారాయణ.

"టిఫిన్ రెడీగా ఉంది. చేసి వె..."

"ఓ... సారీ డియర్. షార్ప్ సెవెనో క్లాక్ కల్లా ఒక ముఖ్యమైన మీటింగ్ ఉంది. ప్లీజ్. నేను బయట తింటాను. మీరు కానివ్వండి" అంటూ గుమ్మం దాటబోయాడు.

"డాడీ..." అంటూ పరుగెత్తుకొచ్చాడు బాబిగాడు. "హాఁ... వాట్ కన్నా... ఏంటీ..." సాధ్యమైనంత ప్రేమను కనబరుస్తూ అన్నాడు ఆలస్యమవుతున్నందుకు కలుగుతున్న అసహనాన్ని వెనుకకు నెడుతూ.

"ఈ రోజు మా కాన్వెంట్‌లో పేరెంట్స్ మీటింగ్ ఉంది. నువ్వూ, మమ్మీ రావాలి" అన్నాడు బాబిగాడు.

"అయాం సారీ బాబూ! ఈ రోజు ఫుల్ బిజీ. ప్లీజ్ గో విత్ యువర్ మమ్మీ. ఈసారి తప్పకుండా నేను వస్తాను" అంటూ వాడి బుగ్గ చిదిమి బయటకు వెళ్ళిపోయాడు నారాయణ. అతని వెనకే పరిగెత్తాడు సెక్రటరీ.

"ఛ..." విసుగ్గా సోఫాలో కూలబడింది సువర్చల. అతిమెత్తని ఆ ఆసనంలో ఏవో ముళ్లు గుచ్చుకుంటున్నట్లుగా అనీజీగా కదిలింది ఆమె.

"మమ్మీ... డాడీ చూడు..." అంటూ తన దగ్గరకొచ్చిన బాబిగాణ్ణి ఒళ్లోకి తీసుకుంది.

వాణ్ణి ఎలా సముదాయించాలో ఆమెకర్థం కాలేదు.

* * *

పదే పదే తన భార్య అదే పాటను ఎందుకు



ప్రముఖ కథారచయిత శ్రీ వడలి రాధాకృష్ణ రచించిన 'అంతర్నేత్రం' కథా సంపుటి ఆవిష్కరణ దృశ్యం. చిత్రంలో ప్రముఖ సాహితీవేత్తలు శ్రీ కె. బాలకృష్ణారెడ్డి, శ్రీ పొన్నాడ గిరిజాశంకరరావు, శ్రీ బి. హనుమారెడ్డి, శ్రీ పొన్నూరి వేంకటశ్రీనివాసులు, శ్రీ కరణం సుబ్బారావు, డా॥ వి.ఆర్. రాసాని, రచయిత శ్రీ వడలి రాధాకృష్ణ, యస్వీ. కృష్ణ, సి.యస్. చంద్రశేఖర్‌గార్లను చూడవచ్చు.

ఎంతగా హింసించిందో గ్రహింపుకొస్తోంది.

ఆ రోజుల్ని తలుచుకుంటే... మండుటెండలో మలయసమీరం వీచినట్లుగా తోస్తోంది. తను కోల్పోయిందేమిటో తెలిసివస్తోంది. ఈ మూడేళ్ళుగా నారాయణతో ఏరోజూ పట్టుమని పది నిమిషాలు మాట్లాడిందిలేదు ఎదురుగా కూర్చుని. ఏం కావాలన్నా... ఏం చేయాలన్నా... ఫోన్లలోనే. అదీ ఎవరో తరుముకొస్తున్నట్లుగా. పైగా ఆ ముచ్చుముఖం ప్రసాద్‌గాడి పర్మిషనొకటి. ఎప్పుడు ఫోన్ చేసినా ముందు వాడే తీసేది. ముగ్గురూ కలిసి భోజనం చేసి ఎన్నాళ్ళయిందో? కలిసి బజారుకెళ్ళి ఎన్ని రోజులయింది? సాయంకాలపు నీరెండలో డాబా మీద కబుర్లాడుకున్నది ఏనాటి జ్ఞాపకాలో అన్నట్టుగా ఉంది. అతని గుండెల మీద తల ఆన్చి నిద్రపోయిన వైనం ఏజన్మలోనిదిగానో అన్పిస్తోంది. జ్ఞాపకాల పొరలనొక్కొక్కదాన్నీ తిరగేస్తూంటే తానిన్నాళ్ళుగా ఏం కోల్పోయిందీ ఆమెకర్థమయింది. పొంగిపొరలే దుఃఖం ఆమె కళ్ళల్లో నుంచి నీరై ప్రవహించింది. టీపాయ్ మీదున్న సెల్ అందుకొని గబగబా నెంబర్లు నొక్కింది. అవతల్నుంచి ప్రసాద్ కంఠం విన్పించింది.

"ప్రసాద్... వెంటనే సార్‌తో మాట్లాడాలి" అంది.

సారీ మేడం... సార్ చాలా అవసరమైన మీటింగ్‌లో ఉన్నారు. డిస్టర్బ్ అవుతుందని సెల్ కూడా నా చేతికిచ్చేసారు. మరొక గంటవరకూ సార్ బిజీ మేడం" అన్నాడు.

"షిట్" అనుకుంటూ చేతిలోని సెల్ సోఫాలోకి విసిరేసింది.

లేచి బెడ్‌రూమ్‌లోకి వెళ్ళింది. ఇంట్లో అడుగడుగునా ఎదురయ్యే 'రిచ్‌నెస్' ఆమెకిప్పుడు ఎలర్జీగా ఉంది. ఒకప్పుడు ఇంద్రవైభవంలా భావించిన ఆ సంపద ఇప్పుడు ఆమెకి ఎడారిలో భగభగ మండే నిప్పుకణికల్లా రగిలే ఇసుక కుప్పల్లా కన్పిస్తోంది. టేబుల్ మీదున్న స్క్రిబ్లింగ్ పాడ్ తీసుకుని గబగబా ఏదో వ్రాసింది. మళ్ళా ఆఫీసుకి రింగ్ చేసింది. ప్రసాద్ లైన్‌లోకొచ్చాడు. "ప్రసాద్... నువ్వా బిజీగా ఉన్నావా..." అడిగింది.

"నో మేడం వాట్‌కెనైడూ ఫర్‌యూ మేడం?" విధేయతగా అడిగాడు ప్రసాద్.

"వెంటనే బయల్దేరి ఇంటికిరా..." అని ఫోన్ కట్ చేసింది సువర్చల.

"ఎస్ మేడం" అంటూ వచ్చాడు ప్రసాద్. హాల్లో సోఫాలో కూర్చున్న సువర్చల ఉలికిపాటుగా చూసింది అతని వంక. టీపాయ్ మీద ఉన్న కవర్ని అతనికిస్తూ "సార్ మీటింగ్ అవగానే ఆయనకందించు. ఎన్ని అపాయింట్‌మెంట్స్ ఉన్నా వాటిని ప్రక్కనపెట్టి, ముందుగా దీన్ని చదవమని చెప్పు" చెప్పింది సువర్చల.

"ఎస్ మేడం" అంటూ వినయంగా ఆ కవరందుకొని వెళ్ళిపోయాడు ప్రసాద్.


గుండెలపై నుంచి ఎంతో భారం తీరిన దానిలా ఊపిరి పీల్చుకొని రిలాక్స్‌డ్‌గా సోఫాలో వెనక్కివాలి కళ్ళు మూసుకుంది సువర్చల.

* * *

ఆతృతగా కవరు విప్పి చూసాడు నారాయణ తన ఛాంబర్‌లో. ముత్యాలు వరుసగా పేర్చినట్లున్న సువర్చల చేతివ్రాత చూడగానే అతనికెంతో ఆహ్లాదంగా అన్పించింది. గబగబా అక్షరాల వెంట పరిగెత్తించాడు తన చూపుల్ని.

డియర్ శ్రీవారూ...

మనం ప్రేమించి పెళ్ళి చేసుకోలేదు.




అయినా ఒకరినొకరు పూర్తిగా అర్థం చేసుకున్న అవగాహనతోనే జీవితం సాగించాం కొన్నేళ్ళ క్రితం వరకూ. మీ ఆర్జన ఏపాటిదైనా సంసారాన్ని సక్రమంగానే సాగించుకున్నాం. ఏ దురదృష్టఛాయల బలమో అర్థంలేని ఆశల వలయంలో చిక్కి మిమ్మల్ని ఎంతగానో వేధించిన వైనం ఈనాడు నా గుండెల్లో చిచ్చు రగుల్చుతోంది. మీరు చెప్పిన ప్రతిమాటా అక్షరసత్యమన్న సత్యాన్ని ఆలస్యంగా తెలుసుకున్నాను. ఆలస్యంగానైనా అసలు నిజాన్ని కళ్ళుతెరిచికనగలిగినందుకు నాకు చాలా సంతోషంగా ఉంది. ఏమండీ... నాకీ సంపదలూ... భోగాలు వద్దండీ. మీకు నా చేతుల్తో వండి పెట్టుకొనే అదృష్టం చాలు. మీ సమక్షంలో గడిపే క్షణాలు చాలండీ. ప్లీజ్ మన పాత జీవితాన్నే మనం కోరుకుందామండీ. మీ గుండెలపై తలపెట్టి, మీకౌగిలిలో కరిగిపోయే ఆ క్షణాలు చాలండీ నాకు. ఈ లక్షలు... లక్ష్యాలు వద్దండీ. అనుక్షణం మీకళ్ళముందుండగలిగే వరాన్ని ప్రసాదించరూ! పిచ్చిపిచ్చి కోర్కెలతో మీ మనసును గాయపరచిన ఈ పిచ్చిదాన్ని మన్నించరూ...

మీ సువర్చల.

ఉత్తరాన్ని చదివి ఆ కాగితాలను పెదవులకాన్చుకున్నాడు నారాయణ. వెంటనే ఇంటికి రింగ్ చేసాడు. సువర్చల హలో అనగానే మౌత్‌పీస్ మీద గట్టిగా శబ్దం వచ్చేలా ముద్దు పెట్టుకున్నాడు. "ఏయ్... ఏమిటీ చిలిపితనం" సిగ్గుపడుతున్నట్టుగా వినిపించింది సువర్చల గొంతు. "ఏయ్ పిచ్చీ... ఏమిటీ రాతలు... ఏమ్మా అప్పుడే అంత బోర్ కొట్టిందా? స్వీటీ... నీ నుంచి ఎప్పుడెప్పుడు ఇలాంటి కోరిక వెల్లడవుతుందా అని ఎదురుచూస్తున్నాను. నా మాటల్లో నిజాలేమిటో నువ్వు తెలుసుకోవాలనే ఇదంతా చేసాను. వెల్. ఈ రోజు నుంచి ఇదంతా బంద్. దేవిగారి ఆజ్ఞ. ఇంకెప్పుడూ నీ కౌగిలిలోనే" అంటూ ఫోన్ పెట్టేసాడు ఇంటికి బయల్దేరడానికి లేస్తూ. ●